# పరిపూర్ణ విడుదల

ఆధ్యాత్మిక మాసపత్రిక

అర్పణ : 20 ఆగష్టు : 2018 విడుదల : 12

**క్రీస్తు**

**మనలను**

**స్వతంత్రులనుగా**

**చేసియున్నాడు.**

**గలతి. 5:1**

# పరిపూర్ణ విడుదల

ఎడిటర్ : బ్రదర్ దీవెనయ్య

ఆగష్టు - 2018

సంవత్సరపు సభ్యత్వ చందా: రూ.100/-

## విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | ఎడిటర్ అర్పణ | 3-4 |
| 2. | సంరక్షణ - కాపుదల | 5 |
| 3. | దేవుని రాకడ యొక్క ఉద్దేశము | 6-10 |
| 4. | దేవునితో ఏకాంత సమయం | 10-11 |
| 5. | దేవుని సంతోషపెట్టుట | 12-18 |
| 6. | సువార్త కూటములు | 18 |
| 7. | కలువరి ప్రేమ | 19 |



### మా వద్ద లభించు పుస్తకములు

దేవుడు టిబెట్ భాష మాట్లాడెను

ఉజ్జీవం ఎందుకు ఆలస్యమవుతుంది?

ఉజ్జీవ ప్రార్థన

దేవుని మార్గములో ఉజ్జీవం

ఆత్మీయతకు బలమైన పునాది

సొదొమకు బైబిలు లేదు

శ్రేష్టమైనది

ప్రార్థనా సంపద

# ఎడిటర్ అర్పణ

మన రక్షకుడైన యేసుప్రభువు నామములో మీ అందరికి నా హృదయపూర్వక వందనములు.

**"సత్యము మిమ్మును స్వతంత్రులనుగా చేయును"**

**యోహాను 8:32.**

సర్వమానవాళి పాపమనే దాస్యపు కాడిక్రింద అపవాది చెరలో బంధింపబడి ఉన్నారు. మన పాపపు సంకెళ్ళను తెంచి మనలను స్వతంత్రులనుగా చేయుటకొరకు ప్రభువైన యేసుక్రీస్తు సిలువలో మన శిక్షను, మన శాపమును, మన తీర్పును భరించిరి. ఎవరైతే క్రీస్తుయేసు బోధయందు నిలిచియుందురో వారే సత్యమును తెలిసికొందురు. కృపయు సత్యమును క్రీస్తుద్వారా కలిగెను. ఏ మానవుడు అయితే కృపయందును, సత్యమందును నిలిచియుందురో వారే స్వతంత్రులుగా చేయబడుదురు. సత్యము మనుష్యులను తమయొక్క అజ్ఞానమనే పాపపు దాసత్వము నుండి స్వతంత్రునిగా చేస్తుంది. చెరలోనున్న వారికి విడుదల ప్రకటించుట కొరకై యేసుప్రభువు ఈ లోకమునకు వచ్చిరి. యేసుప్రభువు రక్తము ద్వారా మనకు పాపమునుండి విముక్తి కలుగుతుంది. అనేకులు తాము ఆత్మసంబంధమైన బానిసత్వములో ఉన్నారని వారికి తెలియదు. యూదులు స్వతంత్రులు అని అనుకొన్నారు (యోహాను 8:33) గాని వారు ధర్మశాస్త్రమునకు దాసులుగా ఉన్నారు. ధర్మశాస్త్రముచేత వారు శిక్షావిధికి గురైనారు. ఎవరైతే యేసునందు విశ్వాసముంచుదురో పరిశుద్ధాత్మ వారి జీవితములోనికి వారి హృదయములోనికి ప్రవేశించి దేవునికి లోబడుటకు నూతన కోరికను నూతన శక్తిని అనుగ్రహిస్తాడు. పాపపు బానిసత్వము నుండి మనలను మనమే స్వతంత్రులముగా చేసికొనలేము. యేసుప్రభువే మనలను స్వతంత్రులనుగా చేయును. ఆయన మనలను పాపము యొక్క శక్తి నుండి పాపశిక్షనుండి స్వతంత్రులుగా చేస్తాడు.

సమరయస్త్రీ, పాపాత్మురాలైన స్త్రీ పాపపు బానిసత్వములో బంధింపబడి ఉన్నారు. వారికి ప్రభువైన యేసుక్రీస్తు యొక్క ప్రేమ, వాత్సల్యత, (కృప, విశ్వాసము) ద్వారా విడుదల దొరికినది. అప్పుడు వారు ఆత్మలో స్వతంత్రులుగా పిలువబడి దేవుని కుమార్తెలుగా అంగీకరించబడ్డారు. ఈ

స్వాతంత్ర్యము మహిమగల స్వాతంత్ర్యము రోమా 8:21. వారికి ఆత్మసంబంధమైన మరణము, నాశనము గాని ఉండదు. ఈ మహిమగల స్వాతంత్ర్యమునే నిత్యజీవము అందురు. నేనిచ్చు నీళ్లు త్రాగువాడు ఎప్పుడును దప్పిగొనడు అని ప్రభువు చెప్పారు. **"నాయందు విశ్వాసముంచువాడెవడో లేఖనము చెప్పినట్టు వాని కడుపులోనుండి జీవజలనదులు పారునని బిగ్గరగా చెప్పెను" యోహాను 7:38.** ఎవడైనను దప్పిగొనిన యెడల నా యొద్దకు వచ్చి దప్పితీర్చుకొనుడి.

సమరయస్త్రీ దాస్యపు కాడి నుండి విడుదల పొంది స్వతంత్రురాలై అనేకులకు ఆ స్వాతంత్ర్యమును గూర్చి వివరించుటకు సుఖారను గ్రామములోనికి వెళ్ళి అనేకులను ప్రభువు చెంతకు నడిపించినది. **" స్వాతంత్ర్యము నిచ్చు సంపూర్ణమైన నియమములో తేరి చూచి నిలుకడగా ఉండువాడెవడో వాడు విని మరచువాడు కాక, క్రియను చేయువాడైయుండి తన క్రియలో ధన్యుడగును" యాకోబు 1:25.** అనేకులు స్వతంత్రులుగా చేయబడి నిలకడగా ఉండే విషయం మరచిపోవుచున్నారు. అందుకే పౌలు గలతీయులకు **"ఈ స్వాతంత్ర్యము అనుగ్రహించి, క్రీస్తు మనలను స్వతంత్రులనుగా చేసియున్నాడు. కాబట్టి మీరు స్థిరముగా నిలిచి మరల దాస్యమను కాడిక్రింద చిక్కుకొనకుడి" గలతి.5:1** అని చెప్పెను. **"సహోదరులారా, మీరు స్వతంత్రులుగా ఉండుటకు పిలువబడితిరి. అయితే ఒక మాట, ఆ స్వాతంత్ర్యమును శారీరక్రియలకు హేతువు చేసికొనక, ప్రేమకలిగినవారై యొకనికొకడు దాసులైయుండుడి" గలతి.5:13.**

ప్రియులారా! మానవుడు స్వేచ్ఛానుసారంగా ఉండాలని లెస్సయైన జ్ఞానమునకు విరోధంగా ఉంటున్నాడు. నిజమైన స్వాతంత్ర్యము క్రీస్తు ప్రభువులోనే ఉంది. ప్రజలు, దేశాలు, చట్టాలు, నాయకులు, ప్రణాళికలు, పథకాలు మనకు స్వాతంత్ర్యము ఇవ్వవు గాని యేసుక్రీస్తు కలువరి రక్తములో కడుగబడవలెను. ప్రభువు అనుగ్రహించే స్వాతంత్ర్యము మహిమగలది, స్థిరమైనది, వాడబారనిది, జీవముగలది అది శాశ్వతమైన స్వాతంత్ర్యము. ఎందరో పాపపుబానిసత్వములో మగ్గిపోవుచున్నారు. ఇటువంటి వారి విడుదల కొరకు సుఖారను గ్రామమునకు మిషనరీగా వెళ్లిన సమరయస్త్రీ వలె, పునాదులుగల పట్టణము కొరకు ఎదురు చూచిన అబ్రాహామువలె, సమస్తము నష్టముగా పెంటగా ఎంచుకొన్న పౌలువలె నిలుకడగా ఉండి ప్రభువు కొరకు పానార్పణముగా పోయబడుటకు పరిశుద్ధాత్మ దేవుడు సహాయము చేయును గాక !

**– ఎడిటర్**

# సంరక్షణ – కాపుదల

**"నీ భారము యెహోవామీద మోపుము ఆయనే నిన్ను ఆదుకొనును" కీర్తన 55:22.**

దావీదునకు మిత్రునిగా ఉన్న వానినుండే విరోధాన్ని శత్రుత్వాన్ని ఎదుర్కొంటున్న సమయంలో దావీదు ఈ అద్భుతమైన కీర్తనను వ్రాశాడు. విరోధిని దావీదు నమ్మాడు. అయితే అతడు దావీదుపై కుట్రపన్ని యెరూషలేమును సంక్షోభంలో ముంచి అతనిని సింహాసనం దించడములో దాదాపుగా సఫలీకృతుడయ్యాడు. ఆ వత్తిడి నుండి తప్పించుకొనే అవకాశమేమి లేక తాను ఆధారపడగలిగిన ఒకే ఒక ఆధారం వైపుకు దావీదు తిరిగాడు. తనను ఆదుకొనగలడని తానెరిగిన దేవుని మీదనే తన భారమంతా మోపాడు.

ప్రభువు కన్నులు నా మీద ఉన్నాయి

నేను చేసే ప్రతి పని ఆయన చూస్తాడు

ఆయన చేతులు నా చుట్టూ ఆవరించి ఉన్నాయి

ఆయనే నన్ను క్షేమంగా భద్రంగా కాపాడతాడు.

దేవుని మాటకు అవిధేయుడైనను దేవుని ఆజ్ఞలకు లోబడకపోయినను తిరుగుబాటుచేసినను దేవుని సంరక్షణ తనకుంటుందనే నిశ్చయతను దావీదు కలిగి ఉన్నాడు. ఆయన చిత్తం నుండి వైదొలగిన ఘడియలున్న ఎన్ని వైఫల్యాలు మనకున్నను ఎంత అద్భుతమైన సత్యం దేవుని బిడ్డలముగా దేవుని సంరక్షణకు ఎప్పుడు దూరంకాము.

నీవు దేవునిని మరచిపోవచ్చు

కాని ఆయన నిన్నెనడు మరువడు.

# దేవుని రాకడ యొక్క ఉద్దేశము

## ఇదిగో నేను త్వరగా వచ్చుచున్నాను ప్రకటన 22:12

ప్రభువైన యేసుక్రీస్తు మొదటిసారి లోకపాపమును మోసికొనిపోవు దేవుని గొఱ్ఱెపిల్లగా వచ్చి (యోహాను 1:29) నశించిపోవుచున్న వారి పాపపరిహారార్థం కలువరి సిలువలో పరిశుద్ధమైన రక్తమును చిందించెను. తిరిగి రెండవసారి ఈ లోకమునకు రాబోవుచున్నాడు. ప్రభువు రెండవమారు వచ్చుటలో ఉన్న ఉద్దేశమును ధ్యానిద్దాం.

**1. సమస్త జనములను పోగుచేయుటకు : "అప్పుడు సమస్త జనములు ఆయనయెదుట పోగుచేయబడుదురు; గొల్లవాడు మేకలలోనుండి గొఱ్ఱెలను వేరుపరచునట్లు ఆయన వారిని వేరుపరచి..." మత్తయి 25:32.** భూలోకములోనున్న సమస్తజనములు, సామాన్యులు, సామంతులు, ధనికులు, దరిద్రులు, లోకనివాసులు దేవుని యొక్క సింహాసనము ముందు నిలువబడుదురు. సమస్త జనములు అనగా సృష్టి ఆరంభమునుండి ప్రభువు వచ్చు వరకు భూమిమీద జీవించిన ప్రతిమనుష్యుడు జాతి, కుల, మత, బేధములు లేకుండ స్త్రీ, పురుషుడని బాలురు, యౌవనులు అని లేకుండా భూగోళముమీద మానవునిగా పుట్టిన ప్రతి ఒక్కరు యేసయ్య సింహాసనము ముందు నిలువబడవలసినదే. ఏ ఒక్కరును తప్పించుకొనలేరు. నీకు యిష్టము ఉన్న లేకున్న ఆ దినమును తప్పించుకొనలేవు. ఇప్పుడు నీవు సువార్త వినకుండా దేవుని ప్రేమను త్యాగమును గ్రహించకుండా తప్పించుకొని తిరుగవచ్చు అయితే ఆ దినమున ఎవరు తప్పించుకొనలేరు.

**2. రహస్యములను వెలుగులోనికి తీసికొని వచ్చుదురు: "ఆయన అంధకారమందలి రహస్యములను వెలుగులోనికి తెచ్చి హృదయములలోని ఆలోచనలను బయలుపరచునప్పుడు, ప్రతివానికి తగిన మెప్పు దేవునివలన కలుగును" 1కొరింథి. 4:5.**

అంధకారమందలి రహస్యములను వెలుగులోనికి తెచ్చుటకు హృదయములోని ఆలోచనలను బయలుపరచుటకు ప్రభువు వచ్చుచున్నారు.

అంధకారమందలి రహస్యములను అనగా మన పాపములను మన హృదయములోని ఆలోచనలను మన రహస్య కోరికలను మరియు ఉద్దేశములను బయలుపరచుటకు ప్రభువు వచ్చుచున్నారు. మన రహస్య జీవితమును ప్రభువు మాత్రమే గ్రహించగలరు. ఈ లోకములో ఏ జ్ఞాని మానవుని అంతరంగములో ఉన్న రహస్యములను గ్రహించలేరు. ఒక్క యేసయ్య మాత్రమే గ్రహించగలరు. ఆయన సర్వజ్ఞుడు మానవుని జీవితము అంత్యదినము బట్టబయలు చేయును.

**3. కఠినమైన మాటలను గూర్చి ఒప్పించుటకు: "ఇదిగో అందరికి తీర్పుతీర్చుటకును, వారిలో భక్తిహీనులందరును భక్తిహీనముగా చేసిన వారి భక్తిహీన క్రియలన్నిటిని గూర్చియు, భక్తిహీనులైన పాపులు తనకు విరోధముగా చెప్పిన కఠినమైన మాటలన్నిటినిగూర్చియు వారిని ఒప్పించుటకును, ప్రభువు తన వేవేల పరిశుద్ధుల పరివారముతో వచ్చెను" యూదా 15.**

మనము చాలా జాగ్రత్తగా మన భక్తిజీవితమును కాపాడుకొనవలెను. నోటిని, నాలుకను భద్రముగా కాపాడుకొనవలెను. విస్తారమైన మాటలలో దోషము ఉండును. మన మాటలు కొద్దిగా ఉండవలెను. భక్తిహీనమైన మాటలు, కఠినమైన మాటలు మన నోట రాకూడదు. అనేకులు వారి దురాశల చొప్పున నడుచుకొనుచు లాభము నిమిత్తము మనుష్యులను కొనియాడుచు సణుగువారును తమ గతిని గూర్చి నిందించువారునై యున్నారు. వారి నోరు డంబమైన మాటలు పలుకును. మానవుడు పలుకు ప్రతి వ్యర్థమైన మాటను గూర్చి ఆ దినమున ఒప్పింపజేయును. ఏ శరీరియు అతిశయించుటకు తప్పించుకొనుటకు వీలులేదు. ప్రతిఒక్కరు ఒప్పింపజేయబడుదురు.

**4. తీర్పుతీర్చుటకు : "దేవుని యెదుటను, సజీవులకును మృతులకును తీర్పుతీర్చు క్రీస్తుయేసు ఎదుటను ఆయన ప్రత్యక్షతతోడు ఆయన రాజ్యముతోడు, నేను ఆనబెట్టి చెప్పునదేమనగా" 2తిమోతి. 4:1.** దేవుడు న్యాయాధిపతినిగా నియమించెను ఆయన నీతిగల న్యాయాధిపతి. తీర్పు తీర్చుటకు సిద్ధముగా ఉన్నారు. **"భూమికి తీర్పు తీర్చుటకై నీతినిబట్టి లోకమునకు తీర్పు తీర్చుటకై న్యాయమునుబట్టి జనములకు తీర్పు తీర్చుటకై యెహోవా వేంచేసియున్నాడు" కీర్తన. 98:9.** మనయందు మనకు

ఏ దోషము కానరాదు. గొప్ప దైవజనుడైన పౌలు నన్ను విమర్శించువాడు ప్రభువే అని చెప్పుచున్నారు. మనలను విమర్శించువాడు ప్రభువే. దేవుడు మానవుని యొక్క రహస్యములను విమర్శించును రోమా 2:16. **"న్యాయమునుబట్టి లోకమునకు తన విశ్వాస్యతను బట్టి జనములకు ఆయన తీర్పు తీర్చును" కీర్తన.96:13.** దేవునికి పక్షపాతము లేదు. అనేకులు ఇతరులకు తీర్పు తీర్చుచు అట్టి కార్యములనే చేయుచున్నారు (రోమా 2:1) అట్టివారు దేవుని తీర్పును తప్పించుకొనలేరు అని ప్రభువు చెప్పారు. తీర్పు తీర్చుట దేవుని పని, తన సహోదరునికి విరోధముగా మాటలాడి తన సహోదరునికి తీర్పు తీర్చువాడు ధర్మశాస్త్రమునకు తీర్పు తీర్చుచున్నాడు. పరునికి తీర్పు తీర్చుటకు నీవెవడవు? అని దేవుని వాక్యం సెలవిస్తుంది.

మనుష్యకుమారుడు తన మహిమతోను ఆయనతో కూడ సమస్త దూతలును వచ్చునప్పుడు ఆయన తన మహిమగల సింహాసనము మీద ఆసీనుడై యుండును. అప్పుడు సమస్త జనములు ఆయన యెదుట పోగుచేయబడుదురు. విశ్వాసులు, అవిశ్వాసులు, అపొస్తలులు, బోధకులు, కాపరులు, పరిచారకులు అందరు ఆయన సింహాసనము ఎదుట నిలువబడవలసినదే. అంతేగాక కొద్దివారేమి గొప్పవారేమి మృతులైన వారందరు ఆ సింహాసనము ఎదుట నిలువబడుదురు. గ్రంథములు విప్పబడును ఆ గ్రంథములయందు వ్రాయబడి యున్న వాటిని బట్టి తమ క్రియల చొప్పున మృతులు తీర్పుపొందుదురు. **"ఎవని పేరైనను జీవగ్రంథమందు వ్రాయబడినట్టు కనబడనియెడల వాడు అగ్ని గుండములో పడవేయబడెను"** ప్రకటన **20:15. "ఆయనయందు విశ్వాసముంచువానికి తీర్పుతీర్చబడదు" యోహాను 3:18. "కుమారునియందు విశ్వాసముంచువాడే నిత్యజీవముగలవాడు" యోహాను 3:36.**

**5. ప్రతిఫలమిచ్చుటకు:** "మనుష్యకుమారుడు తన తండ్రి మహిమగలవాడై తన **దూతలతోకూడ రాబోవుచున్నాడు అప్పుడాయన ఎవని క్రియలచొప్పున వానికి ఫలమిచ్చును" మత్తయి 16:27.**

క్రీస్తు ప్రభువును తండ్రి మన కొరకు బహుమానంగా పరలోకము నుండి పంపించారు. ఆ బహుమానం ఎవరైతే అంగీకరించి ఆనందించారో

అట్టి వారికి తగిన ఫలములు ప్రభువు అనుగ్రహిస్తారు. ప్రభువు త్వరగా రానైయున్న కారణం ఆయన సిద్ధపరచిన జీతము తీసికొని వస్తున్నారు. ఎవని క్రియల చొప్పున ప్రతివానికిచ్చుటకు ప్రభువు రాబోవుచున్నారు. తమ చేతి క్రియలవలన వారు నాకు కోపము పుట్టించిరి యిర్మీయా 32:30. వారి ప్రవర్తనను బట్టియు, వారి క్రియాఫలమును బట్టియు అందరికి ప్రతిఫలమిచ్చును. మానవుడు **"తాను జరిగించిన క్రియలచొప్పున, అవి మంచివైనను సరే చెడ్డవైనను సరే, దేహముతో జరిగించిన వాటి ఫలమును ప్రతివాడును పొందునట్లు మనమందరమును క్రీస్తు న్యాయపీఠము ఎదుట ప్రత్యక్షము కావలయును" 2కొరింథి.5:10.** అపొస్తలుడైన పౌలు గలతీయులకు వ్రాస్తూ ప్రతివాడును తాను చేయుపనిని పరీక్షించి చూచుకొనవలెను గలతి.6:4. నరులకు వాని వాని పనులను బట్టి క్రియలను బట్టి అంధకారమందలి రహస్యములనుబట్టి హృదయాలోచనను బట్టి తాను చేసిన కష్టముకొలది జీతము ప్రభువు ఇచ్చును. నీతిమంతులు మేలు అను ఫలమును దుష్టులు శ్రమ అనే ఫలమును పొందుదురు యెషయా 3:10,11. ప్రభువు ఎవరిని విడిచిపెట్టరు. విమర్శ దినమున ప్రతిమాటకు, ప్రతి తలంపుకు, ప్రతి పనికి బహుమానమును, ఫలమును, జీతమును ప్రతిఫలమును పొందుదురు.

ప్రభువైన యేసుక్రీస్తును రక్షకునిగా ఎవరైతే అంగీకరిస్తారో వారిమీద పాపము ప్రభుత్వము చేయదు. **"పాపమునుండి విమోచింపబడి నీతికి దాసులైతిరి" రోమా 6:18.** పాపమునకు దాసులైయున్నప్పుడు నీతి విషయమై నిర్బంధములేనివారై యుంటిరి. అప్పటి క్రియలవలన మీకేమి ఫలము కలిగెను. వాటి అంతము మరణమే. పాపమునుండి విమోచింపబడి దేవునికి దాసులైనందున పరిశుద్ధత కలుగుటయే ఫలము దాని అంతము నిత్యజీవము. పాపము వలన వచ్చు జీతము మరణము రోమా 6:23.

ఎవరైతే యేసయ్యను తిరస్కరిస్తారో అట్టివారు నిత్యమరణము అనేఫలమును పొందుదురు. పాపినని గ్రహించి ప్రభువును రక్షకునిగా అంగీకరించిన వారికి పరిశుద్ధఫలము నిత్యజీవమనే ఫలమును పొందుకొంటారు. అందుకే ప్రభువు చెప్పారు ప్రతివానికిచ్చుటకు జీతము నాయొద్ద ఉన్నది అది సిద్ధపరచబడుచున్నది.

దేవుని బిడ్డలారా! ప్రభువును ఏ విధంగా సంధించబోవుచున్నారు? ఏ ఫలము పొందుకొనబోవుచున్నారు? ఇది కృపాకాలం. ఇంకను మీ హృదయములను ప్రభువుకు ఇవ్వకుండా మీరు మీ హృదయములో ప్రభువును చేర్చుకొనకుండా ఉంటే ఈ దినం మరొక అవకాశం ప్రభువు నీకు అనుగ్రహిస్తున్నారు. అవిధేయులైన వారి కొరకు దినమెల్ల ప్రభువు గాయపడిన చేతులు చాపబడి యున్నవి. క్రీస్తు పాదముల చెంత సాగిలపడి పాపినని ఒప్పుకొని ప్రభువు రక్తములో కడుగబడి నిత్యజీవము అనే ఫలము పొందుకొనుటకు ప్రభువు సహాయము చేయును గాక!

ప్రభువు తిరిగి రానైయున్న ఉద్దేశమును గ్రహించి భయముతో వణకుతో మనకిచ్చిన సొంత రక్షణను కొనసాగించుకొనుటకు ప్రభువు యెదుట నిర్దోషముగా నిలువబడి ప్రభువు ఇచ్చే బహుమానం పొందుకొనుటకు ప్రభువు సహాయం చేయును గాక!

## దేవునితో ఏకాంత సమయం

**“అప్పుడు నీవు నీ యింటిలోనికి వచ్చి నీవును నీ కుమారులును లోపలనుండి తలుపు మూయవలెను” 2రాజులు 4:4**

వాళ్ళు ప్రకృతిసిద్ధమైన సూత్రాలకి, మానవ ప్రభుత్వాలకి, సంఘానికి, యాజకత్వానికి, చివరికి ఎలీషా ప్రవక్తకి కూడ అతీతమైన అద్భుత కార్యం కోసం ఎదురుచూస్తున్నారు గనుక దేవునితో ఒంటరిగానే ఉండాలి. మరెవరూ వాళ్ళతో ఉండకూడదు. మానవ అవగాహన శక్తిని, విజ్ఞానశాస్త్ర సూత్రాలను వదిలి అంతరిక్షంలో దేవుని మహిమకి ఎదురై నిలిచి ఆ అలోక శక్తిని తేరిపార చూడాలి.

దేవునితో వ్యవహారాలు పెట్టుకోవాలంటే ఏ పద్ధతి అనుసరించాలో ఇక్కడ మనకి కనిపిస్తుంది. ఒంటరిగా రహస్య స్థలములో ప్రార్థన విశ్వాసాలలో ప్రతి ఆత్మ ఆయనకొరకు ఎదురుచూడాలి.

కొన్ని సమయాల్లో కొన్ని ప్రదేశాల్లో దేవుడు మనచుట్టు ఒక అనిర్వచనీయమైన గోడ కడతాడు. మనకి ఉన్న ఆధారాలన్నింటినీ పడగొడతాడు. సాధారణంగా మనం పనులు చేసే పరిస్థితులనూ, విధానాలనూ, నిరర్థకం చేస్తాడు. మనకర్థం కాని దివ్య వాతావరణంలో బంధిస్తాడు. అది మనకి ఇంతకుముందు అనుభవం కానిది, క్రొత్తది. మనకి ఇంతవరకు అలవాటైన అనుభవాల చట్రంలో ఇమడనిది. ఈ క్రొత్త అనుభవంలో అయితే ముందేం జరుగనున్నతో మనకి తెలియదు. మన జీవితం అనే వస్త్రాన్ని దేవుడు తన స్వరూపం వచ్చేలా కత్తిరిస్తాడు.

చాలామంది భక్తిగల మనుష్యులు కూడ ఒకరకమైన గానుగెద్దు జీవితం గడుపుతుంటారు. ప్రతిరోజూ అదే జీవితం. ముందు ఏం జరుగనున్నదో అనే సందేహం ఉండదు. కాని దేవుడు నడిపించే ఆత్మలైతే ఎన్నెన్నో ప్రత్యేకమైన ఊహలకందని అనుభవాల్లోకి వెళుతూ ఉంటాయి. దేవుడు తమని నడిపిస్తున్నాడు అన్న విషయం తప్ప మరేది తెలియని అనిశ్చిత పరిస్థితుల్లో ఆయన బంధిస్తాడు. వాళ్ళు దేవునిపై తప్ప మరిక దేనిమీద ఏ విధంగానూ ఆధారపడడం వీలుకాదు.

పై వాక్యంలోని విధవరాలిలాగా మనం కూడ బాహ్యమైన వాటిని వదిలి, లోపల కేవలం దేవునితో మాత్రమే కలుపబడితేనే తప్ప ఆయన చేసే అద్భుతాన్ని చూడలేము. అతి కష్టకాలంలోనే దేవుడిని గురించిన అతి మధురమైన రహస్యాలు బయటపడుతుంటాయి.

మనల్ని లోపలుంచి తలుపుమూసి

మన బాధలో, దుఃఖములో పలుకుతాడు దేవుడు

మనస్సు విప్పి మృదువుగా, ఏకాంతంలో

ముత్యాల్లాంటి మాటలు మన చెవిలో

## దేవునిని సంతోషపెట్టుట

**"యెహోవా, నేను యథార్థవంతుడనై ప్రవర్తించుచున్నాను నాకు తీర్పు తీర్చుము. ఏమియు సందేహపడకుండ యెహోవాయందు నేను నమ్మిక యుంచియున్నాను కీర్తన.26:1.** దావీదు తన జీవితంలో దేవుని యందు నమ్మికయుంచెను. మనము దేవునియందు నమ్మికయుంచి దానిని అంతము వరకు కాపాడుకొనవలెను. అంత్యదినములలో భూమి మీద విశ్వాసమును కనుగొనగలమా అని ప్రభువు చెప్పెను. పౌలు నా విశ్వాసమును కాపాడుకొంటిని 2తిమోతి.3:7 అని చెప్పెను. దావీదు గొప్ప రాజైనను తనకున్న రాజ్యం మీద, వెండి బంగారముల మీద, నైపుణ్యం మీద నమ్మిక ఉంచలేదు గాని దేవునియందు నమ్మిక యుంచెను. ఈ రోజు నీవు విశ్వాసంలో ఎక్కడ ఉన్నావు? ఒక ఆత్మసంబంధమైన వ్యక్తి దేవునిని సంతోషపెట్టును. విశ్వాసం లేకుండా దేవునికి ఇష్టులైయుండుట అసాధ్యము హెబ్రి.11:6. నీవు దేవుని సంతోషపెట్టాలి అంటే దేవునియందు నమ్మిక యుంచవలెను. నిన్ను నీవు సంతోషపెట్టుకొనక దేవుని సంతోషపెట్టుము అప్పుడు దేవునికి మహిమ కలుగుతుంది. మనం ఎల్లప్పుడు దేవునియందు నమ్మికయుంచి దేవుని సంతోషపెట్టుచూ ఆయనను మహిమపరచేవారిగా ఉండవలెను.

**"యెహోవా నీ నివాసమందిరమును నీ తేజోమహిమ నిలుచు స్థలమును నేను ప్రేమించుచున్నాను" కీర్తన.26:8.** నీవు దేవుని మహిమపరచే వ్యక్తివి అయితే దేవుని మందిరమును ప్రేమిస్తావు. దావీదు దేవుని యొక్క నివాసమందిరమును ప్రేమిస్తున్నాడు. ఈ స్థలమందు చేయబడు ప్రార్థనలమీద నా కనుదృష్టి నిలుచును అని ప్రభువు చెప్పారు. దావీదు అంతఃపురమును ప్రేమించలేదు గాని దేవుని తేజోమహిమ నిలుచు స్థలమును ఆయన ప్రసన్నత ఉండే మందిరమును ప్రేమించాడు. చిరకాలము యెహోవా మందిరములో నేను నివాసము చేసెదను అని దావీదు పలికెను. **"యెహోవా ప్రసన్నతను చూచుటకును ఆయన ఆలయములో ధ్యానించుటకును నా జీవితకాలమంతయు నేను యెహోవా మందిరములో నివసింప గోరుచున్నాను" కీర్తన.27:4.** నిజముగా మనము

దేవుని ప్రేమిస్తే దేవుని మందిరము మనకు ప్రియముగా ఉంటుంది. సమూయేలు దేవుని మందిరములో ఉన్నాడు కాబట్టి దేవుని ప్రత్యక్షత దొరికినది, దేవుని స్వరమును వినగలిగెను. మనము దేవుని మందిరమును, దేవుని నివాస స్థలమును ఆయన మందిరములో జరిగే పరిచర్యను ప్రేమించేవారముగా ఉండాలి. యేసుప్రభువు పరిచర్య చేయడానికి వచ్చారు. ఆయన పిల్లలముగా మనము దేవుని మందిరములో ఏ పరిచర్య చేసినను అది మనకు ఆశీర్వాదమే.

**"యెహోవా, నన్ను పరిశీలించుము, నన్ను పరీక్షించుము నా అంతరింద్రియములను నా హృదయమును పరిశోధించుము" కీర్తన.26:2.** నీవు దేవుని సంతోషపెట్టాలనే వ్యక్తివి అయితే నిన్ను నీవు పరీక్షించుకొంటావు. నీ ప్రార్ధనా జీవితం నీ విశ్వాసం నీ విధేయత నీవు దేవునితో గడిపే సమయం ఎక్కడ ఉందని పరీక్షించుకొంటావు. యేసుప్రభువు భూమిమీద ఉన్న దినములలో మీరు నా గురించి ఏమనుకొంటున్నారు అని శిష్యులను అడిగెను. అందరు ఏమనుకొంటున్నారు అనేది ఆయనకు ప్రాముఖ్యం కాదు. దేవుని యెదుట మనము పరీక్షించబడడానికి అప్పగించుకొనవలెను. మన ప్రక్కన ఉన్నవారిని మన విషయమై అడగాలి. దావీదు ఇతరులలో లోపాలు చూడలేదు గాని తనను తాను పరీక్షించుకొన్నాడు. షిమీ ఎంతో భయంకరముగా దావీదును దూషించాడు. అహీతోపెలు అయితే దావీదు విషయమై దురాలోచన చేశాడు, తన స్వంత కుమారుడైన అబ్షాలోము తనపై తిరుగబడ్డాడు కాని దావీదు ఎవరిని వేలెత్తి చూపించలేదు. దావీదు తన మాటలను తన ఆలోచనలను దేవుని సన్నిధిలో పరీక్షించుకొన్నాడు.

**"నా దోషములెన్ని? నా పాపములెన్ని? నా అతిక్రమమును నా పాపమును నాకు తెలియజేయుము" యోబు 13:23.** దేవుడు తన సన్నిధిలో మనలను పరీక్షించి పుటము వేసి మనలోని మష్టంతటిని తొలగిస్తాడు. **"నేను అగ్నిలోనుండి వెండినితీసి శుద్ధపరచినట్లు శుద్ధపరతును. బంగారమును శోధించినట్లు వారిని శోధింతును వారు నా నామమును బట్టి మొఱ్ఱపెట్టగా నేను వారి మొఱ్ఱను ఆలకింతును జెకర్యా 13:9.** నీవు అడిగితే బంగారమును వెండిని ఏలాగు పుటము వేస్తారో

ప్రభువు నిన్ను ఆలాగు పుటము వేస్తారు. నీవు దేవునికి అవకాశమిస్తే నీ గుడారములో ఉన్న దుర్మార్గతను మష్టును పులిపిండిని బయటకు తీసికొని వస్తారు. నేను అగ్నిలో నుండి వెండిని తీసి శుద్ధపరచినట్లు శుద్ధపరుస్తాను. బంగారమును శోధించినట్లు వారిని శోధిస్తాను. దేవా నా దోషములెన్ని నా పాపములెన్ని నేనెక్కడ తప్పిపోతున్నాను పరీక్షించుము అని అడుగవలెను. నేను మారుమనస్సు పొందాను, బాప్తిస్మం తీసుకున్నాను సేవలో వున్నాను కదా అనే గర్వం మనలో పనిచేయకూడదు. దేనిని బట్టి అతిశయించక పరీక్షించుకొని ఈ మష్టును మన జీవితంలో నుండి తొలగించుమని ప్రభువును అడిగితే ఆయన శుద్ధిచేస్తారు.

**"దేవా, నన్ను పరిశోధించి నా హృదయమును తెలిసికొనుము నన్ను పరీక్షించి నా ఆలోచనలను తెలిసికొనుము" కీర్తన.139:23.** మన హృదయాలోచనలో గతదినములన్నింటిలో ఎక్కడైన తప్పిపోయామా? దావీదు దేవునియందు ఎంత విశ్వాసముంచాడో దేవుని నివాసస్థలమును ఎంత ప్రేమించాడో అంత లోతుగా పరీక్షించుకొంటున్నాడు. మరి ఇటువంటి వారు దేవుని సంతోషపెట్టకుండా ఎలా ఉండగలరు. నిన్ను నీవు సంతోషపెట్టుకొంటే దేవుని హస్తాలకు అప్పగించుకొనలేవు. దేవునిని సంతోషపెట్టే వ్యక్తివి అయితే నిన్ను నీవు పరీక్షించుకొని ఆయన యందు విశ్వాసముంచి ఆయనను ప్రేమిస్తావు. దేవా నాహృదయం ఎలా లోతుగా త్రవ్వుకోవాలి అనుకొంటావు. అందుకే దావీదు నేను కూర్చుండుట నేను లేచుట నీకు తెలియును. నా తలంపు పుట్టకమునుపే నీవు నా మనస్సు గ్రహించుచున్నావు. నాలో తలంపు పుట్టకమునుపే నీవు నన్ను ఎరిగియున్నావు. నా ఆలోచనలను, నా తలంపులను, నా మాటలను, నా చూపులను, నా నడకలను పరీక్షించు అని దావీదు దేవుని అడిగెను కీర్తన.139:2,3. **"ఊరకుండుడి నేనే దేవుడనని తెలిసికొనుడి అన్యజనులలో నేను మహోన్నతుడనగుదును. భూమిమీద నేను మహోన్నతుడనగుదును" కీర్తన.46:10** దేవుని సన్నిధిలో మూలుగుచూ మొరపెట్టుకొంటున్నాడు. మొరపెట్టుకొంటే ఆయన మనలను నిర్దోషులుగా చేస్తారు.

**"సైన్యములకధిపతివగు యెహోవా, నీతిమంతులను పరిశోధించువాడవు నీవే; అంతరింద్రియములను హృదయమును చూచువాడవు నీవే" యిర్మీయా 20:12.** మనము ఇంకా పాపం దోషం ఏమిటి అని అనుకొంటాం కాని దేవుడు నీతిమంతులను పరీక్షిస్తాడు. మనము నీతిమంతులమే ప్రభువు రక్తంలో కడగబడినవారమే కాని మనకు అత్యున్నతమైన పరిశుద్ధ జీవితం కావాలి. పరిశుద్ధతలో నుండి అతిపరిశుద్ధతలోనికి తీసికొని వెళ్ళమని ప్రభువును అడుగవలెను. మనము నీతిమంతులమే అనుకొన్నట్లయితే తోటి సహోదరులతో, పొరుగువారితో, సమాధానం కాపాడుకొనవలెను. అందుకే నేను నీతిమంతులను పరీక్షిస్తాను అని ప్రభువు చెప్పారు.

**"ఆయన నా ప్రవర్తన నెరుగును గదా నా అడుగుజాడలనన్నిటిని లెక్కించును గదా" యోబు 31:4.** నీ అడుగులను కూడా దేవుడు లెక్కిస్తాడు. గతదినములలో నీ అడుగులు ఎటువెళ్ళినవి? వెళ్ళకూడని స్థలములకు వెళ్ళినవా? చూడకూడనివి చూశావా? పలుకకూడనివి పలికావా? వినకూడనివి విన్నావా? దేవుడు అడుగులు లెక్కపెడితే మరి చూపులను, మాటలను లెక్క పెట్టడా? దావీదు దేవా నా నోటిమాటలు నా హృదయధ్యానము నీ దృష్టికి అంగీకారములగును గాక అని చెప్పెను. నీ మాటలు ఆయనకు అంగీకారమవ్వాలి. నీవు మాట్లాడే ప్రతిమాట, వేసే ప్రతి అడుగు పవిత్రమైన మార్గములోనే నడువవలెను ఇష్టానుసారముగా నడువకూడదు. నీవు అన్ని విషయములలో దేవునికి మహిమకరముగా ఉండవలెను.

**"యెహోవా, నేను నీ సత్యము ననుసరించి నడుచుకొనునట్లు నీ మార్గమును నాకు బోధింపుము" కీర్తన.86:11.** దావీదు సత్యాన్ని అనుసరించి నడుస్తున్నాడు అనగా నడిచే అడుగులలో కూడా సత్యం కావాలి. అడుగులలో సత్యం కావాలి అంటే జీవితమంతా సత్యాన్ని కలిగి ఉండవలెను. మన ప్రాణాత్మ దేహములలో కూడా సత్యం ఉండవలెను. దావీదు నేను ఎక్కడైనను తప్పిపోతానేమో? రాజునని విర్రవీగుతానేమో ధనం ఉందని, బలం ఉందని, భవనం ఉందని, అధ్యక్షుడుగా ఉన్నానని అనుకొనక తనను తాను లోతుగా

పరీక్షించుకొంటు నేను సత్యాన్ని అనుసరించి నడుస్తానని చెప్పెను. నోటిమాటలలో హృదయధ్యానంలో తప్పిపోయామా? మన అడుగులలో, మన క్రియలలో, మన తలంపులలో, మన ఆలోచనలలో సత్యం ఉండాలి. దావీదుకు సత్యాన్ని అనుసరించి జీవించడం ఇష్టం. నీవు ఏమని ప్రార్థన చేయుచున్నావు? సత్యానికి విరుద్ధంగా నడుచుచున్నావా? విరుద్ధంగా తలంచుచున్నావా? దేవుని వాక్యానికి, ఉపదేశానికి వ్యతిరేకంగా తలంచే తలంపులు నీలో ఉన్నాయా? పరీక్షించుకొనుము. సత్యాన్ని అనుసరించి దావీదు నడచినట్లుగా నడిస్తే అదే దేవునికి మహిమ. అదే దేవునికి సంతోషం. మన ఆత్మీయ జీవితములో దేవున్ని సంతోషపెట్టాలంటే దేవునియందు నమ్మికయుంచాలి ఆయనను ప్రేమించాలి. మనలను పరీక్షించడానికి దేవునికి అప్పగించుకోవాలి.

**"పనికిమాలినవారితో నేను సాంగత్యము చేయను వేషధారులతో పొందుచేయను. దుష్టుల సంఘము నాకు అసహ్యము భక్తిహీనులతో సాంగత్యముచేయను" కీర్తన.26:4,5.** మన జీవితం మార్చబడినట్లయితే భక్తిహీనులను పాత స్నేహితులను, లోకంలో ఉన్నటువంటి వ్యక్తులను విడిచిపెడతాము. దుష్టసాంగత్యము, వేషధారణ ఎవరి హృదయంలో అయితే ఉంటుందో అటువంటి వారితో నీవు సహవాసం చేయకూడదు. దేవుని నమ్మి మరలా లోకాన్ని అనుసరించేవారు వేషధారులు. వేషధారులు దేవుని కొరకు జీవించలేరు. దేవుని పేరు పెట్టుకొంటారు గాని చెప్పేది ఒకటి చేసేది ఒకటిగా వారి జీవితాలు ఉంటాయి. అందుకే దావీదు అంటున్నాడు నేను వేషధారులతో సాంగత్యం చేయను. నీవు గత దినములలో ఎవరితో సాంగత్యము చేశావు? ఎవరితో మాట్లాడావు, ఎవరితో నడిచావు? ఎవరితో కలసి ఆలోచన చేసావు? ఈ దినం నీ సాంగత్యం ఎవరితో? నీవు సాంగత్యం చేసేది దేవునితోనా, దేవుని బిడ్డలతోనా, భక్తిహీనులతోనా? నీవు భక్తిహీనులతో సాంగత్యం చేస్తే నీలోనికి భక్తిహీనత త్వరగా ప్రవేశించి తదుపరి ఆత్మీయముగా దిగజారిపోతావు. భక్తిజీవితాన్ని కట్టుకోవడం, నిలబెట్టుకోవడం చాలా కష్టం కాని దిగజారిపోవడానికి ఒక్క క్షణము చాలు అది చాలా సులభం. నీవు భక్తిజీవితాన్ని కట్టుకొంటున్నావా?

మాటిమాటికి దిగజారిపోవుచున్నావా? రోజురోజుకు అమ్నోను చిక్కిపోవడానికి కారణం భక్తిహీనమైన ఆలోచనలు తన తలంపులలో ప్రవేశించినవి. రాజకుమారుడైన అమ్నోను కపటం కలిగినవారితో సహవాసం చేశాడు రాజకుమారునికి జీవించవలసిన అమ్నోను భక్తిహీనుడైపోయాడు. మనము రాజులైన యాజకసమూహము, ప్రభువు రక్తములో కడుగబడినవారము, పరిశుద్ధమైన జనాంగముగా ప్రభువు మనలను చేశారు. మరి నీ సాంగత్యం ఎవరితో, నీ సహవాసం భక్తిహీనులతోనా, వేషధారులతోనా, దేవుని వాక్యానికి వ్యతిరేకంగా నడిచేవారితోనా? ఉపదేశానికి వ్యతిరేకంగా నడిచేవారితోనా? పరిశీలించుకొనుము. మంచినీరు, ఉప్పునీరు రెండు ఒకే కుళాయిలో నుండి బయటకు రావు. నీవు వేషధారులతో పొందుచేసి భక్తికలిగిన వారితో కూడ సాంగత్యము చేస్తున్నావు అంటే రెండు నాలుకలు ఉన్నాయి అని గ్రహించుకొనవలెను. భక్తిహీనులతో చెప్పేమాటలు భక్తిహీనులతో చెప్తాము. భక్తికలిగినవారితో చెప్పే మాటలు వారితో చెప్తాము. దావీదు నేను ఇట్టి విధముగా జీవించకూడదు అని ఎంతో జాగ్రత్తగా తన భక్తిజీవితాన్ని కాపాడుకొన్నాడు. **"నిర్దోషినని నా చేతులు కడుగుకొందును యెహోవా, నీ బలిపీఠముచుట్టు ప్రదక్షిణము చేయుదును. అచ్చట కృతజ్ఞతాస్తుతులు చెల్లింతును. నీ ఆశ్చర్యకార్యములను వివరింతును" కీర్తన.26:6,7.** వారు లంచగొండులు, వేషధారులు, భక్తిహీనులు కాబట్టి దావీదు నేను వారితో సాంగత్యము చేయనంటున్నాడు. అటువంటి వారితో నీవు సాంగత్యం చేస్తే నిన్ను కూడా లోకంలోనికి లాక్కొనిపోతారు. దేవుడు క్షమిస్తాడు అని వెళ్ళకూడని స్థలాలకు వెళ్ళి ఆత్మీయముగా నాణ్యతను పోగొట్టుకొంటాము. దావీదు భక్తిహీనులతో సాంగత్యము చేయకుండ తనను తాను కాపాడుకొన్నాడు. రాజు కంటే ఎక్కువమంది స్నేహితులు మనకు ఉంటారా? ఎక్కువమంది బలగం మనకు ఉన్నదా? దావీదు రాజుకంటే ఎక్కువ దండులు మనకు ఉన్నారా? ఎవరితో సాంగత్యము చేస్తున్నాము. దావీదు అంటున్నాడు వారి చేతులన్ని లంచాలు వారి చేతులన్ని దుష్కార్యాలు వారి చేతిలో నుండి నన్ను కాపాడు నన్ను నేను నీకు అప్పగించుకున్నాను. ఎంత దయగల మాటలు దావీదు దేవునితో చెప్పుచున్నాడు దేని కొరకు మనము

ప్రార్థన చేసుకొంటున్నాము? లంచాలు ఇచ్చేవారిగా ఉన్నామా? లంచాలు పుచ్చుకొనేవారిగా ఉన్నామా? ఏమైన దొరుకుతుందని అపేక్షిస్తున్నామా? దావీదుకు ఇటువంటి మనస్సు లేదు. మనుష్యులు రొట్టె వలన మాత్రము కాదు గాని దేవుని నోట నుండి వచ్చే ప్రతిమాటవలన బ్రతుకుదురు. దావీదు రాజు దావీదుకు ఉన్న బలగం దావీదుకు ఉన్న బలం, ధనం స్నేహితులు చాలా గొప్పవాళ్ళు కాని భక్తిహీనులతో సాంగత్యము చేయలేదు.

**కృతాజ్ఞతస్తుతులు: "యెహోవా, నీ బలిపీఠముచుట్ట ప్రదక్షిణము చేయుదును. అచ్చట కృతాజ్ఞతాస్తుతులు చెల్లింతును" కీర్తన. 26:6,7.** దావీదు నోట స్తుతి ఉంది, కృతాజ్ఞతస్తుతులు ఉన్నాయి. మన నోట దేవుని ప్రేమ కొరకు, మనకు ఇచ్చిన రక్షణ, పిలుపు, ఉపదేశం, క్షేమం కొరకు కృతాజ్ఞతస్తుతులు చెల్లించవలెను. నీవు స్తుతించలేని వ్యక్తివి అయితే దేవుని సంతోషపెట్టలేవు. దేవుడు చేసిన మేలులను భయానకమైన పరిస్థితులలో ఆయన కాపాడినందుకు మంచి ఆరోగ్యాన్ని ఇచ్చినందుకు స్తుతించుము. స్తుతిచేయుట యథార్థవంతులకు శోభస్కరము. స్తుతియాగము చేయువాడు దేవునిని మహిమపరచుచున్నాడు.

## సువార్త ఉజ్జీవ కూటములు

| | |
|---|---|
| **2018 సెప్టెంబర్ 2,3** | **చేబ్రోలు**, గుంటూరు జిల్లా,<br>**కరెంట్ ఆఫీసు దగ్గర** |
| **2018 సెప్టెంబర్ 4,5,6** | **సూర్యాపేట**, సూర్యాపేట జిల్లా<br>తెలంగాణ<br>**గవర్నమెంట్ జూనియర్ కాలేజి గ్రౌండ్స్** |
| **2018 సెప్టెంబర్ 7,8,9** | **ఖానాపూర్**, నిర్మల్ జిల్లా, తెలంగాణ<br>**CSI చర్చ్ గ్రౌండ్** |
| **2018 సెప్టెంబర్ 10,11,12** | **కైకలూరు**, కృష్ణా జిల్లా<br>**DNR కాంపౌండ్** |

# కలువరి ప్రేమ

**"నేను, యేసుక్రీస్తును అనగా, సిలువవేయబడిన యేసుక్రీస్తును తప్ప, మరిదేనిని మీ మధ్య నెరుగకుందునని నిశ్చయించుకొంటిని" 1కొరింథి.2:2.**

మొరేవియన్ మిషనరీలు మొట్టమొదట గ్రీన్‌లాండ్‌కు వచ్చినప్పుడు అక్కడ ఉన్న ప్రజలకు పాపము, నీతి, సమాధానము అనే పదములకు అర్థం తెలియదు అని కనుగొన్నారు. అందుచేత వారికి వివిధ తత్వశాస్త్ర పదాలను గూర్చి వివరించాలనుకొన్నారు. అలా వివరించినప్పుడు ఏ విధంగా ఫలితాలు కనిపించలేదు. మొరేవియన్ మిషనరీలకు ఏ మాత్రం ఆశాజనకంగా అనిపించక తాము వెనుదిరిగి వెళ్ళవలసి వస్తుందేమో అని అనుకొన్నారు. అయితే వారు తిరిగి వెళ్ళడానికి ఓడలేమీ అందుబాటులో లేనందువలన వారిలో ఒక మిషనరీ క్రొత్తనిబంధనను అక్కడ స్థానిక భాషలోకి అనువదించడం మొదలుపెట్టాడు. తన అనువాదం సరిగ్గా ఉందో లేదో పరీక్షించడానికి ఒక వాక్యభాగాన్ని అంతకుముందు తన సేవకు ఏ మాత్రం ప్రతిస్పందించనివారికి చదివి వినిపించాడు. అతడు ఎంచుకొన్న వాక్యభాగం సిలువమీద క్రీస్తు శ్రమ మరియు మరణం.

అతడు చదివి ముగించిన తరువాత ఆ తెగనాయకుడు దానిని తిరిగి చదువమని కోరాడు. మిషనరీ మళ్ళీ ఆ వాక్యం చదివాడు. అప్పుడా నాయకుడు మీరు ముందుగా దీనిని మాకెందుకు చెప్పలేదు అని అడిగాడు. మీరు మీ స్వదేశమునకు వెళ్ళవద్దు మా కొరకు అంతగా శ్రమపొందిన ఆ మహనీయుని మాటలు వినడం మాకెంతో సంతోషం అని చెప్పాడు.

ఆ తరువాత మొరేవియన్ మిషనరీలు అక్కడే ఉండి క్రీస్తును ప్రకటించి తమ సేవయొక్క సమృద్ధియైన ఫలాన్ని చూశారు. సిలువ సందేశం అక్కడ ప్రజల హృదయాలను గెలుచుకొనినది. మనకు కూడా క్రీస్తు అందరికొరకు మరణించడానికి ఆయనను సిలువ మీదకి నడిపించిన ప్రేమను గూర్చి ఇతరులకు చెప్పే అవకాశం లభిస్తుంది. మన సాక్ష్యానికి సిలువనే కేంద్రంగా చేసికోవాలి.

మీరు విశ్వాసము ద్వారా కృపచేతనే క్రీస్తును రక్షకునిగా అంగీకరించుట వలననే రక్షింపబడియున్నారు.

RNI Regd.No.AP TEL/1998/ 6358 Postal Regd.No.GTR/64/2016-18

## సంపూర్ణ రాత్రి ఉపవాస ప్రార్థన

స్థలము: **హోలీమినిస్ట్రీస్ ప్రార్థనా మందిరము**

**బుడంపాడు, గుంటూరు**

**ప్రతి నెల 1 వ తేది**

సమయం: రాత్రి గం॥9.00 ల నుండి ఉ॥5.00 గం॥ల వరకు

To,
Sri / Smt.

If undelivered please return to :

**Bro. DEEVANAIAH,** Editor,
*PARIPURNA VIDUDALA*
Horeb Prardhana Konda, **BUDAMPADU**
Etukuru - 522 017, Guntur Dist. A.P.
Phone : 9491475967, 9290901396

Edited, Published and owned by Bro. Chereddy Deevanaiah, Horeb Prardhana Konda, Budampadu - 522 017, Guntur Dist.
Printed by P. Srinivasa Rao, at Ushasri Graphics, Lalapet, Guntur, Ph : 2224257
Date of Posting : 11th & 12th of Every Month